


*మిస్టర్ మిరియం*

**నా పద్దెనిమిదో** ఏట అనుకుంటా ఆంధ్రప్రభ వారపత్రికలో ఓ కథ చదివాను. దాని పేరు రామ్‌లాల్ ఉవాచ. ఎవరు రాసారో పేరు మర్చిపోయా కాని ఆ రోజుల్లో ఆ రచయిత ప్రభకి విరివిగా కథలు రాసేవారు. రామ్‌లాల్ అనే అమాయకుడు చేసే నవ్వొచ్చే పనులే ఆ కథ సారాంశం. ఆ కథని కాని దాని పేరు కానీ నేను మర్చిపోలేదు.




1990లలో నేను పోలిష్ జోక్స్ అనే పుస్తకం చదివాను. అవన్నీ మనం వెర్రివెంగళప్ప లేదా వెంగళ్రావ్ జోక్స్‌గా పిలుచుకునే సర్దార్జీ జోక్స్. అది చదువుతూంటే రామ్‌లాల్ ఉవాచ గుర్తొచ్చింది. ఇవి ప్రపంచంలోని వివిధ దేశాల్లో, వివిధ పేర్లతో చలామణిలో ఉన్నాయి. హిందీలో సుపండి జోక్స్‌గా లేదా తెలుగులో బారాబజే జోక్స్‌గా, అమెరికాలో బ్లాండి జోక్స్, రెడ్ హెడ్ జోక్స్‌గా, బ్రిటన్‌లో ఐరిష్ జోక్స్‌గా, డంబ్ జోక్స్‌గా, ఇలా అనేక పేర్లతో చలామణిలో ఉన్నాయి. గతంలో సాఫ్ట్ ఫోర్నో జోక్స్‌తో కల్నల్ ఏకలింగం ఎడ్వెంచర్స్ అనే నవలని రాసాను. రామ్‌లాల్‌లాంటి పాత్రతో కేవలం సర్దార్జీ జోక్స్‌తో నవలని రాయచ్చని అది చదువుతూంటే అనిపించింది. అప్పటినించి అలాంటి జోక్స్ తారసపడినప్పుడల్లా రాసి పెట్టుకోసాగాను. క్రమంగా ఇంటర్నెట్ సదుపాయం వచ్చాక సమయం ఉన్నప్పుడల్లా ఇలాంటి జోక్స్‌ని సేకరించసాగాను. అలా ఈ అంశానికే చెందిన జోక్స్‌ని దాదాపు 1500 దాకా సేకరించగలిగాను.

2008లో చతుర, విపుల ఎడిటర్ శ్రీ చంద్రప్రతాప్ విపులకి ఏదైనా వినోద రచన ఇవ్వమని కోరారు. మిస్టర్ మిరియం అనే అమాయక చక్రవర్తి హీరోగా కథాక్రమంలో గుచ్చిన ఈ సర్దార్జీ జోక్స్ వివరించాను. ఆయన ఆసక్తిగా ఉందంటే, రెండు ఇన్‌స్టాల్‌మెంట్ మేటర్ని రాసిచ్చాను.

దీనిలోని విశిష్టత, ఒకే అంశం మీద జోక్స్ మాత్రమే ఉండటం.

మొదటినించి చివరిదాకా చదివితే కథ.

అక్కడక్కడా చదివితే జోక్స్ బుక్‌లా అనిపించడం.

ఈ జోక్స్‌ని ఓ డైరీలో పేజీకి ఒకటి చొప్పున రాసాను. ఆ పేజీలని చింపి, కథాక్రమంలో అమర్చుకుని ఆ ప్రకారం పేజీ నంబర్లు వేసుకుని, పాత్రల పేర్లు అనుకుని వాటిని మళ్ళీ రాసాను. విపుల మాసపత్రికలో దీన్ని రెండేళ్ళ పైగా సీరియల్‌గా వేసారు. ఈనాడు సంస్థ పత్రికల్లో సీరియల్‌గా వెలువడ్డ మొదటి నవల ఇదే అంతకు మునుపు శీర్షికలు తప్ప సీరియల్స్ ఉండేవి కావు. దీంట్లో ప్రధాన పాత్రధారి పేరు మిరియం. జంధ్యాలగారు ఈ టీవికి 'పోపుల పెట్టె' అనే కామెడీ సీరియల్ తీద్దామనుకున్నప్పుడు పెట్టెలోని వస్తువుల పేర్లే పాత్రలకి పెడితే బావుంటుందని సూచించాను. అది ఎందుకో జరగలేదు.

వాటిల్లో ఘాటైన లవంగం, మిరియం, దాల్చిన చెక్కలు ఉండవు. ముందర మిస్టర్ లవంగం అనుకున్నాను. కానీ మిస్టర్ మిరియం రైమింగ్‌గా ఉంటుందనుకుని హీరోకి ఆ పేరు పెట్టాను. మిరియం ఎక్కడికి వెళితే అక్కడంతా చిరునవ్వులే. నోరు తెరచి జోక్ చెప్పకుండానే చుట్టుపక్కల వాళ్ళని నవ్విస్తాడు. అలా అని అతను సర్కస్ బఫూనో, జోకరో, రేలంగో, రమణారెడ్డో, బ్రహ్మానందమో కాదు. ఐనా అందర్నీ నవ్విస్తాడు తప్ప తను మాత్రం నవ్వడు. పైగా చుట్టుపక్కల వాళ్ళు తనని చూసి ఎందుకలా నవ్వుతున్నారా అనుకుంటాడు.

మిరియం వంశ పరిచయంతో ఆరంభమై, బాల్యం యవ్వనం, చదువు, పెళ్ళి, అమెరికా పర్యటన, రిటైర్‌మెంట్, వృద్ధాప్యం, చివరికి మరణానంతరం స్వర్గానికి చేరాక అక్కడ జోక్స్‌తో మిరియం చరిత్ర ముగుస్తుంది.

ఏప్రిల్ 2012లో లిపి పబ్లికేషన్స్ మిస్టర్ మిరియం నవలని పుస్తకంగా ప్రచురించింది. 240 పేజీలు. వెల రు. 120/- లిపి ప్రచురణల్లో త్వరగా అమ్ముడైన వాటిలో ఇదొకటి. ఆంధ్రప్రభలో పనిచేసే సి.వి.పద్మాకర్ అనే ఆర్టిస్ట్ దీని కవర్ పేజీని డిజైన్ చేసారు. 2013 నించి ఇది మార్కెట్లో లేదు.

www.anandbooks.com
www.telugubooks.in
*ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి*

Post your comments